




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## - 2 -

చలం గారి గురించి గొల్లపూడి మారుతీరావు గారి అభిప్రాయం చూద్దాం *"తెలుగు కథకి యెంత నిడివైన జీవితం వుందో, అంత మేరా తన అద్భుతమైన ప్రభావాన్ని చూపించిన అరుదైన రచయితల్లో గుడిపాటి వెంకట చలం ఒకరు. ఈ మాట ఈ ఒక్క వాక్యంతోనే ఆపాలి. ఎందుకంటే, చలంగారి జీవితంలోనే ఒకదానికొకటి పొంతనలేని మహా ప్రవాహాలున్నాయి. రెండూ, రెండు రకాలైన అఖండ గోదావరులు. ఆయన జీవితం ఎన్నో అన్వయాల, ఎన్నో విభేదాల, ఎన్నో విలక్షణాల, ఎన్నో వ్యతిరేకతల సమూహం. చలం గారు ఒక ఎనిగ్మా.*

*అయితే, చలం గారి ప్రభావం విలక్షణమైనదీ, కొత్తదీ, విభిన్నమైనదీ, కొంచెం ఇబ్బంది పెట్టేదీ అని తెలిసికూడా, దాంట్లోంచి బయట పడలేనంత ఉధృతి చలం గారిది. ఆ రోజుల్లో చలంగారి రచనలు చదవడం ఒక ఆసక్తి అయితే, చలం గారి రచనలు చదవడం ఆంక్షగా చూశారు. రహస్యంగా, తలగడకింద పెట్టుకొని, చదువుకునే వారు. "చలం గారి పుస్తకం చదువుతున్నాడా?"అనడం వుండేది. చలం ఒక మహా ప్రవాహం. చలం ఒక ఉప్పెన. చలం ఒక పెను తుఫాను.ఈవాల్టికి కూడా. ఆ తరానికి చెందిన ఏ 15 మంది రచయితల్నో పలకరిస్తే, ఎంతోకొంత చలం యొక్క ప్రభావం, పాత్రీకరణగానో, విమర్శ గానో, వ్యంగ్యంగానో శైలీ గానో, శిల్పం గానో ఒప్పుకుంటారు.ఒప్పుకోలేక పోయిన చెప్పుకుంటారు."*

తన జీవితంలో 55 సంవత్సరాలు వచ్చేవరకూ నిరంతర ప్రేమ పిపాసిగా, ఆ తరువాత కూడా మూడు దశాబ్దాల పాటు సుదూర ఆశ్రమవాసిగా గడిపినా, శతాబ్దాలు దాటినా , సంచలనాలను కొనసాగించిన రచనలు వెలువరించిన అత్యంత వివాస్పద రచయితగా అభిమానుల గుండెల్లోనూ, విమర్శకుల నోళ్లల్లోనూ కూడా శాశ్వతంగా కొలువుండిపోయిన గుడిపాటి వెంకట చలం. తరువాత భాగం...

చలంగారి నవలలో అత్యంత వివాస్పదమైన జాబితాలో ముందుగా వుండే నవల "మైదానం".

ఆ నవలను ఇప్పుడు పరిచయం చేయడానికి ప్రయత్నిస్తాను. ఈ నవలను చలంగారు 1927 ప్రాంతాల్లో రాసినట్టుగా రికార్డులు చెబుతున్నాయి. అప్పటికి ఆయన వయసు 33 సంవత్సరాలు. ఈ నవల రాసేటప్పుడు చలం గారి పరిస్థితి ఎలా వుందో చూద్దాం. వాళ్ళ పెద్దబ్బాయి 'రవి' తీవ్రమైన అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. చలం గారికి అంతగా నమ్మకం లేకపోయినప్పటికీ, కొడుకు ఆరోగ్యం కోసమని తీర్ధ యాత్రలు చేశారు. జాతకాలు చూపించారు. ఆయన వుద్యోగం ఏలూరు ఇతర పట్టణాల్లో కొనసాగుతోంది. ఆయన, తన 25,26 సంవత్సరాల వయసులో అంటే, 1921లో మొదలుపెట్టిన రచనా వ్యాసాంగం మొదటినుండీ కూడా ఉధృతంగా కొనసాగుతోంది. ఆపలేని వేగం, సమాజం మీద తీవ్రమైన ప్రభావం చూపిస్తోంది. ఈ "మైదానం"నవల రాసేటప్పటికి చలం గారు శశిరఖా, దైవమిచ్చిన భార్యా, అమీనా లాంటి నవలలూ, బిడ్డల శిక్షణ వంటి వ్యాసాలూ, ప్రేమలేఖలూ, కొన్ని నాటకాలూ, నాటికలూ కధలూ రాసిన అనుభవం వుంది. ఈ నవల రాసేటప్పటికే చలంగారికి వివాస్పదమైన రచయితగా పేరు తెచ్చుకున్నారు. గతంలో రాసిన 'శశిరేఖ' నవల ఇతివృత్తం కూడా 'మైదానం' లాంటిదే అయినప్పటికీ, శశిరేఖ నవల గ్రాంధిక బాష వల్లనో ఏమో గానీ, అ నవల కంటే'మైదానం' నవల పాఠకుల్లోకి ఎక్కువగా చొచ్చుకు వెళ్ళింది. అలాగే అభిమానుల్నీ, వ్యతిరేకుల్నీ కూడా అతలాకుతలం చేసింది. ఇప్పటికీ చేస్తున్నది కూడా. అందుకే మైదానం నవలను ఆ రోజుల్లో చలంగారు పేల్చిన 'డైనమేట్' గా, వివాహ వ్యవస్థకు ఆయన ఇచ్చిన 'వెయ్యి వోల్టుల షాక్' గా విశ్లేషకులు భావిస్తుంటారు. ఈ నవల చదివి, కొంతమంది గృహిణులు, తమ వైవాహిక జీవితాలను చిన్నాభిన్నం చేసుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇంత సంచలనం సృష్టించిన, 92 సంవత్సరాల తర్వాత కూడా సంచలనాలను కలిగిస్తున్న "మైదానం"నవలలో ఏముందసలు? అందులోని కథాంశం ఏమిటి? చూద్దాం.

ఈ "మైదానం" నవలలోని ప్రధాన పాత్ర 'రాజేశ్వరి'. ఆమె ఒక ప్లీడరు గారి భార్య. సాంప్రదాయమైన కుటుంబం. వివాహం అయిన కొత్తలో దాంపత్య జీవితం బాగానే గడచింది. కొన్నాళ్ళు అయిన తర్వాత ఆ ప్లీడరు గారు తీరికలేని బిజీలో ఉండడంతో, జీవితం రసహీనంగా మారింది రాజేశ్వరికి. చాలా యాంత్రికంగా వాళ్ళ జీవితం నడుస్తోంది. పిల్లలు లేరు. అలాంటి సమయంలో భర్త దగ్గరకు ఒక క్లయింట్ లాగా వచ్చినటువంటి 'అమీర్' అనే యువకుడు పరిచయం అవుతాడు. ఆ రోజుల్లో ఇంటికి వచ్చినటువంటి మగవాడు, గృహిణికి పరిచయం అవడం అంటే, అంత సాధారణంగా జరిగే విషయం కాదు.

ఎప్పుడో భర్త లేని సమయంలో అమీర్ రావడం, వాళ్ళిద్దరూ పరిచయం కావడం, చేరువ కావడం, అది శారీరక సంబంధంగా మారడం జరిగింది. అలా కొనసాగుతుండగా అమీర్ "నాతో వచ్చేసేయ్"అంటాడు. ఏమాత్రం మొహమాటం లేకుండా, వెనకా ముందూ ఆలోచించకుండా "వచ్చేస్తాను"అంటుంది రాజేశ్వరి. అమీర్, రాజేశ్వరీలు ఇద్దరూ కలసి, భర్త వుండే దేశానికి దూరంగా, నిజాం దేశంలో కొండల్లో,కోనల్లో ఒక మైదానం చేరుకుంటారు. అక్కడ ఒక పూరి గుడిసెలో వుంటారు. వాళ్ళు వుండే ప్రదేశం ఎలా వుంటుంది?వూరికి చాలా దూరంగా, ఆ ఊరికీ, వీళ్ళు వుండే గుడిసెకూ మధ్య ఒక చింతలతోపు వుంటుంది.ఆ గుడిసెకు దూరంగా ఒక కొండ.ఆ కొండ మీద ఒక పాడుబడిన దేవాలయం.పక్కనే ఒక నది. కనుచూపు మేర ఎవ్వరూ కనిపించరు. ఎటు చూసినా మైదానం. ఆకాశం, భూమిని తాకుతున్న దృశ్యం. అలాంటి ప్రదేశానికి వెళతారు అమీర్, రాజేశ్వరీలు.

వాళ్ళు అక్కడ ప్రేమలో మునిగి తేలుతుంటారు. మూడు నెలలు గడుస్తాయి. రాజేశ్వరికి, భర్త దగ్గర లేని అనురాగం అంతా అమీర్ దగ్గర లభిస్తుంది. అమీర్ ని, తాను చూస్తే చాలు అనేటటువంటి స్వేచ్ఛా ప్రణయంలో వుంటుంది. మూడు నెలల తర్వాత రాజేశ్వరిని వెతుక్కుంటూ ఆమె మేనమామ అక్కడకి వస్తాడు.

"ఎలా వచ్చావు?"అని అడుగుతుంది.

"ఎలాగోలా వచ్చానులే. ఏమిటి నువ్వు చేసిన పని. భర్తను వదిలేసి వచ్చావు. నీకేం దొరికింది ఇక్కడ?"

"ఆ వైవాహిక బంధంలో లేనటువంటి, ఆ చట్రంలో లేనటువంటి, స్వేచ్ఛ నాకెంతో దొరికింది. నన్ను వ్యక్తిలాగా చూసుకునే మనిషి దొరికాడు.అందుకే నేను ఇక్కడ ఉంటున్నాను."

ఆ మేనమామ చుట్టూ చూస్తాడు.పూరి గుడిసె. మట్టికుండ.చిన్న పొయ్యి. ఉండడానికి కూడా ఏమీ లేవు.

"మీరు జీవిస్తున్నది జీవితం కాదు. పశువుల్లాగా జీవిస్తున్నారు" అని తిడతాడు.

"అయినా గానీ, నాకు ఇదే ఆనందం. అమీర్ నన్ను చూసుకున్నట్టుగా, భర్త నన్నెప్పుడూ చూసుకోలేదు. అందువల్ల నేను ఇక్కడే వుంటాను."అంటుంది.

వాళ్ళిద్దరి మధ్యా సంభాషణ కూడా వైవాహిక జీవితానికీ, స్వేచ్ఛకీ మధ్య నున్నటువంటి వ్యత్యాసాలూ, వీటి గురించి చర్చ జరుగుతుంది.

" నువ్వు రా! తీసుకువెళతాను. అయినదేదో అయింది"అంటాడు మేనమామ. ఆయన యెంత చెప్పినా గానీ, రాజేశ్వరి ఒప్పుకోదు. యెంత తిట్టినా, ఆమె చలించదు. ఈలోగా అమీర్ వస్తాడు. ఆ మేనమామని చాలా అవమానం చేస్తాడు. దాంతో అతను వెళ్ళిపోతాడు.

అమీర్, రాజేశ్వరీలు అలా మైదానంలో కొనసాగుతూ వుండగా, కొన్ని రోజులకు అమీర్ దగ్గరకు ఎవరో ఒక కుర్రవాడు వస్తూ వుంటాడు. ఆ కుర్రవాడి పేరు "మీరా". అతనికి 16 సంవత్సరాల వయసు. ఆ కుర్రవాడిని చూడగానే, రాజేశ్వరికి

తమ్ముడిలాగా, ఒక కొడుకు లాగా అనిపించింది. ఆ మీరా వచ్చి, అమీర్ తో దూరంగా వెళ్లి, ఏదో మాట్లాడుతూ వుంటాడు. మీరా మాట్లాడి వెళ్ళిపోగానే అమీర్ చాలా ముభావంగా వుంటాడు.ఆ కుర్రవాడు ఎవరు?అతనొచ్చి, అమీర్ తో ఏం మాట్లాడుతున్నాడు? అతను వెళ్ళిపోగానే అమీర్ ఎందుకిలా అయిపోతున్నాడు? అని తనలో తను మధన పడుతుంది రాజేశ్వరి.

ఒక రోజు మీరా వచ్చేసరికి అమీర్ ఉండడు. "అసలు విషయం ఏమిటి?" అని అడుగుతుంది. ముందు చెప్పడానికి ఇష్ట పడడు, గానీ, రాజేశ్వరి గట్టిగా అడిగే సరికి చెబుతాడు. ఏం జరిగిందంటే...వీళ్ళు వుండే గుడిసెకు, దూరంగా వున్న వూర్లో ఒక తోళ్ళ సాయిబు వుంటాడు.ఆ సాయిబు గారి అమ్మాయిని అమీర్ ప్రేమించాడు. ఆ అమ్మాయి కోసమని మీరాతో కబురు చేస్తుంటాడు. ఆ అమ్మాయి ఒప్పుకోవడం లేదు. ఇదీ జరుగుతున్న వ్యవహారం. ఇదంతా రాజేశ్వరితో చెబుతాడు మీరా.

ముందు రాజేశ్వరి చాలా బాధ పడుతుంది. ఏమిటి ఇలా చేస్తున్నాడు? నేను ఇతని కోసమని కుటుంబాన్ని వదులుకొని వచ్చాను. వదిలేసిన వాళ్ళందరికీ ఇలాగే జరుగుతుందా? మగవాళ్ళందరూ ఇలాగే ఉంటారా? అనుకుంది. కానీ, వెంటనే తనకు అమీర్ మీద ఉన్న ప్రేమ, ఈ భావనలన్నిటినీ పక్కన పెట్టేలా చేస్తుంది.

మర్నాడు వచ్చిన మీరాతో కలసి, " పద..నేనొస్తాను. ఆ తోళ్ళ సాయిబు కూతురుతో మాట్లాడదాం"అని ఆమెతో మాట్లాడుతుంది."అమీర్ నిన్ను ప్రేమిస్తున్నాడు. నువ్వు ఒప్పుకోవాలి"అని ఏం చెబుతుందో ఏమో గానీ, ఆమెని ఒప్పిస్తుంది. ఒప్పించడమే కాకుండా తనే అమీర్ ని తీసుకువెళ్ళి, ఆ తోళ్ళ సాయిబు గారి ఇంట్లో ఉండేలా చేస్తుంది. అది చాలా ప్రేమ అనుకుంటుంది. 'నేను అమీర్ ను ప్రేమిస్తున్నాను. ప్రేమించే వ్యక్తి కోసం ఏమైనా చెయ్యాలి. త్యాగం చేస్తున్నాను.' అనుకొని అమీర్ ను ఆమెతో ఉండేలా చేస్తుంది.

ఒక పది రోజులయ్యాక అమీర్, ఆ అమ్మాయిని వదిలేస్తాడు. ఆ అమ్మాయి మీద అంత ప్రేమ వుండదు. ఆ అమ్మాయంటే విసుక్కుంటాడు. అక్కడకి ఆ సంఘటన ముగిసింది. సరే! రాజేశ్వరీ, అమీర్ లు ఆ గుడిసెలోనే వున్నారు. అలా వుండగా కథలో మరో మలుపు ఏమిటంటే...రాజేశ్వరి గర్భిణీ అని తెలుస్తుంది. ఒక రోజు అమీర్ అడుగుతాడు

"ఏమిటీ?అలా పొట్ట ఎత్తుగా వచ్చింది" అంటే..

"లోపల ఒక ప్రాణి వుంది. బయటకు రావాలని చూస్తోంది"అంటుంది. అయితే, అమీర్ ఒప్పుకోడు.

"నువ్వు ఎలా అయినా గర్భం తీయించేసుకో. నేను అలా గర్భిణి గా చూడలేను. ఈ అందం ఇలాగే వుండాలి"అంటాడు. రాజేశ్వరి ఒప్పుకోదు.

"నేను అలాంటి పని చెయ్యను. నా కడుపులో ఉన్నటువంటి ప్రాణిని తీసుకోలేను. ఆ చిన్ని ప్రాణం నాకు కావాలి"

అమీర్ కు చాలా కోపం వస్తుంది రాజేశ్వరి మీద. అంతవరకూ ఉన్నటువంటి ప్రేమా, ఆరాధనా ఇవన్నీ ఏమైపోతాయో గానీ, "నువ్వు గర్భం తీయించుకోకపోతే, ఇక ఇక్కడ ఉండను. మరో ఆరు నెలల పాటు దూరంగా వెళ్ళిపోతాను." అని

కోపంతో వెళ్ళిపోతాడు. వెళ్లేముందు చెబుతాడు"నీకేమైనా కావాలంటే, మీరా వున్నాడు కదా! అవన్నీ చూస్తాడు"అని వెళ్ళిపోతాడు.

ఇక అతను వెళ్ళిపోయాక రాజేశ్వరికి సహాయం చేసేవారు ఎవరు?మీరాయే. ఆ క్రమం లో వాళ్ళిద్దరూ దగ్గరవుతారు. అంతే కాకుండా కొంత కాలం తర్వాత రాజేశ్వరి ఆలోచిస్తుంది.'అవును, నేను ఇన్ని వదిలేసుకొని వచ్చాను కదా! అమీర్ కోసం. అమీర్ నేనంటే ఇంత ప్రేమగా వున్నాడు. నన్ను గర్భిణిగా చూడలేక వెళ్ళిపోయాడు. పోనీ, తన ప్రేమకోసం నా గర్భాన్ని తీసేసుకుంటే, ఏమవుతుంది?అని ఆలోచించి, అంత త్యాగానికీ సిద్ధ పడుతుంది. మీరా సహాయంతో గర్భాన్ని తీయించేసుకుంటుంది. అంత త్యాగం చేసి, ఆ క్రమంలో మీరా సహాయం చేయడం, మొదట్లో తమ్ముడూ, కొడుకూ అని భావించిందో అలాంటి మీరా తోనే సంబంధం పెట్టుకునే పరిస్థితులు వస్తాయి. వీళ్ళిద్దరూ ఇలా కొనసాగుతూ వుండగా, రాజేశ్వరి ఇలా మామూలుగా అయ్యిందని తెలుస్తుంది మీరా, అమీర్ కి కబురు చేస్తాడు.

అమీర్ మళ్ళీ వెనక్కి వచ్చేస్తాడు. ఇక్కడనుండి ఒక విచిత్రమైన సమస్య ఈ ముగ్గురి మధ్యన. అమీర్, రాజేశ్వరీ ఎలాగూ చాలా రోజులనుండీ వుంటున్నారు. వాళ్ళు స్వేచ్ఛా ప్రణయాన్ని ఆస్వాదిస్తున్నారు. మధ్యలో మీరా, రాజేశ్వరికి దగ్గరయ్యాడు. అది అమీర్ కు తెలిసింది. మీరాకి అమీర్, రాజేశ్వరి ఎప్పటినుండో ఉంటున్నారని తెలుసు.అయినా రాజేశ్వరి తనకు దగ్గర కాకుండా, అమీర్ కు దగ్గరవుతుందని బాధ పడతాడు. ఈ ముక్కోణపు ప్రేమ కథ ఏమవుతుందంటే...

అమీర్, రాజేశ్వరి తో చెబుతాడు"నువ్వు మీరాతో సంబంధం పెట్టుకున్నావు. అది కొనసాగితే గనక నేను ఉండను.మా ఇద్దరిలో ఎవరో ఒకరే వుండాలి"అని. రాజేశ్వరి వీళ్ళిద్దరికీ సంధి చేద్దామని ప్రయత్నిస్తుంది. అంటే, ముగ్గురూ కలసి ఉండడానికి అవుతుందా?అన్నట్లుగా. కానీ, అమీర్ ఏమాత్రమూ ఒప్పుకోడు సరికదా..ఆ మీరాని కత్తితో పొడిచెయ్యడానికి వెళతాడు. ఆ సందర్భంలో మీరాని కాపాడడానికి అడ్డుగా వెళుతుంది రాజేశ్వరి. తన చేతులు అడ్డం పెట్టి మీరాని కాపాడుతుంటే..అమీర్ మళ్ళీ చెబుతాడు "అతనో, నేనో ఒక్కరమే వుండాలి.నువ్వు వాడిని వదిలెయ్యి"అంటాడు. "కుదరదు. ఇతను ఇలాగే వుండాలి"అని రక్షిస్తున్నప్పుడు, ఒక్కసారి రాజేశ్వరి కళ్ళు తెరచి చూసేసరికి అమీర్ తనని తాను కత్తితో పొడిచేసుకొని, కిందపడి గిలగిలా తన్నుకుంటుంటాడు. ఒక్క క్షణం ఏం జరిగిందో అర్థం కాని, మీరాతో చెబుతుంది "నువ్వెళ్ళి వున్న డాక్టర్ ని పిలుచుకురా!". మీరా డాక్టర్ దగ్గరకు పరిగెడతాడు. ఈలోగా అమీర్ తో అంటుంది"ఎందుకిలాంటి పని చేశావు?నీకోసం నేను ఎన్నో వదులుకొని వచ్చాను. ఆ కుర్రవాడిని ఎందుకలా చంపడానికి చూశావు?"అంటుంది.

"లేదు. నా నిర్ణయం ఇదే. నువ్వు అతన్నే కావాలంటే గనక, నన్ను నేను చంపేసుకోవడమేమార్గం"అని చెప్పి చనిపోతాడు. ఈ లోగా డాక్టర్ కోసం వెళ్ళిన మీరా, డాక్టర్ నీ, పోలీసుల్నీ కూడా తీసుకువస్తాడు. రాజేశ్వరికి అర్థం కాదు. పోలీసులు ఎందుకు వచ్చారో? మీరా చెబుతాడు"నేను డాక్టర్ దగ్గరకు వెళ్ళగానే, డాక్టర్, పోలీసులకు ఫోన్ చేశాడు"అని.

పోలీసులు అడుగుతారు "ఎవరు పొడిచారు?"అని. కేసు రాజేశ్వరి మీదకు వెళుతుందని, రాజేశ్వరి ని రక్షించడానికి "నేనే పొడిచాను"అంటాడు మీరా. కానీ, రాజేశ్వరి "నువ్వు కాదు. నేనే పొడిచేసాను"అంటుంది రాజేశ్వరి. "ఆ.. నేనే పొడిచాను."అనే మాటలతో నవల ముగుస్తుంది. ఇదీ స్థూలంగా మైదానం నవలలోని కథాంశం.

ఏ మాత్రం అతిశయోక్తి లేకుండా చెప్పాలంటే..గడచిన సంవత్సరాల్లో 'మైదానం' నవల గురించి, వెయ్యికి పైగా విశ్లేషణలూ, విమర్శలూ, వాఖ్యానాలూ వచ్చి వుంటాయి.నేనిప్పుడు వెయ్యినొకటో వాఖ్యానం చెయ్య బోవడం లేదు. మైదానం నవల లోని కొన్ని కోణాలూ, కొన్ని పొరలూ[లేయర్స్] చూపిస్తాను. ఆ తరువాత మైదానం నవల చదివాక మీరు ఎలాంటి నిర్ణయానికి వస్తారో అది మీ ఇష్టం...

ప్రధాన పాత్రలు మూడే. రాజేశ్వరీ, అమీర్, మీరా. ముందు రాజేశ్వరి వైపునుండి చూద్దాం. ఆమె ప్రవర్తనలో ఎన్ని పొరలు కనిపించాయో. రసహీనమైన దాంపత్యాన్ని వదిలేసి అమీర్ తో వెళ్ళిపోయింది. విశాలమైన మైదానం మీదుగా, భయంకరమైన రక్తపాతంలోనుంచి, జైలు గోడల మధ్యకు సాగిన ఆమె ప్రయాణంలో ఆమె ఆశించిన స్వేచ్ఛా, సుఖం లభించాయా? 'అవును' అని తను చివరి వరకూ అనుకుంది. వచ్చిన దగ్గరనుండి మధ్య మధ్యలో కూడా అమీర్ పెట్టిన చిత్ర హింసలు అన్నీ భరించింది. వేరే అమ్మాయి మీద అమీర్ మనసు పడినప్పుడు, తను మధ్య వర్తిగా వుండి, అది కూడా అమీర్ మీద ప్రేమే అని చెప్పింది. చూసిన మొదట్లో తమ్ముడూ, కొడుకూ అనుకున్న మీరాతో సంబంధం పెట్టుకుంది. జైలులో వుండి కథ చెబుతున్నట్టుగా వుంటుంది. అంటే, 1st person లో ఎవరికో చెబుతున్నట్టుగా కథ నడుస్తుంది.

అప్పటికి కూడా జరిగినటువంటి సంఘటనలలో దేనికీ పశ్చాత్తాపం వుండదు. అంతా కూడా అమీర్ పై ఆకర్షణ. అదొక్కటే నిజం. 'అమీర్ కి నా ప్రేమ ఒక్కటే నిజం' అయితే, ఏ వివాహ బంధం లో అయితే, మగవాడి స్వార్థం ఉంటుందని రాజేశ్వరి పదే పదే చెప్పిందో...అంత స్వార్థాన్ని అమీర్ లో కూడా చూసింది. కానీ, అమీర్ ప్రేమ 'అమర ప్రేమ' అనుకుంటూనే జీవించింది.ఇవన్నీ కూడా రాజేశ్వరి పాత్రలో ఉన్నటువంటి లేయర్స్.

అమీర్ , ఆ పాత్ర చూస్తే, రాజేశ్వరి కోరుకున్నటువంటి స్వేచ్ఛనీ, సుఖాన్నీ అందించినప్పటికీ కూడా, మగవాడి లో ఉన్నటువంటి రాగ ద్వేషాలకు ఏ మాత్రమూ అతీతుడు కాదు. అవసరమై నప్పుడల్లా తన మొండి పట్టుదలను బయట పెడుతూనే వున్నాడు. చివరకు తనని తనే పొడిచేసుకున్నాడు.

ఇక మీరా, చాలా చిన్న పిల్లవాడు. 16, 17 సంవత్సరాలు. తనకు తెలీకుండానే రాజేశ్వరీ, అమీర్ ల చక్ర వ్యూహం లో చిక్కుకున్నాడు. ఇవన్నీ కూడా ఆలోచించవలసిన కోణాలు. ఏది సవ్యం, ఏది అపసవ్యం?ఏది సమర్థనీయం, ఏది కాదు? చలం తీవ్ర వాదా, విప్లవ వాదా? చలం చెప్పిన వన్నీ సంఘ సంస్కరణ భావాలా?నీతి బాహ్యమైన వాదాలా? 'మైదానం' నవల చదివి ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. ఈ కథాంశమూ, వివాదాలూ ఒక్కసారి పక్కకు పెట్టి, రచయితగా చలం గారి 'మైదానం' నవలలోని శైలీ, శిల్పం వాటినీ, అద్భుతమైన ప్రకృతి వర్ణనలూ కథా ప్రవాహంలో మనం కొట్టుకు పోతున్నప్పుడు, భుజంతట్టి

పట్టుకుని ఆపి, మనల్ని ఆలోచింపజేసే “కోటబుల్ కోట్స్”ఇవి పుష్కలంగా దొరుకుతాయి. ఉదహరణకు ..రాజేశ్వరి, అమీర్ తో మైదాన ప్రాంతానికి వచ్చేసిన తర్వాత వచ్చే వాక్యాలు కొన్ని... ఊరికీ మాకూ మధ్య పెద్ద చింత తోట వుంది. గుడిసె తప్ప చుట్టూ ఏమీ లేవు.ఎటు చూసినా నీలపు కొండల్లోనూ,ఆకాశం అంతమయ్యే పెద్ద మైదానం. ఒక పెద్ద కొండ మాత్రం మా ఇంటికి అరమైలు దూరంలో ఉంది. దానిమీద శిధిలమైన కోట ఒకటి ఉంది. మా గుడిసె పక్కన చిన్న యేరు, తొందరగా పరిగెత్తుతూ ఉంటుంది. దాన్ని చూస్తే ఎవరితోనూ మాట్లాడక ఎప్పుడూ పని మీద తిరిగే మా అమ్మ జ్ఞాపకం వచ్చేది”[ఆ వేగంగా వెళ్ళే నదిని చూస్తే, వాళ్ళ అమ్మ జ్ఞాపకం వచ్చేదట]

ఆ దేశంలో ఆకాశం ఎప్పుడూ నీళ్ళను కడుగుతున్నట్టే ఉంటుంది. వాన కురిసినా, కొండల్నీ, నేలనీ ఇంకా శుభ్రంగా కడుగుతుంది. చిటపటమని చినుకులు పడితే, కడుపుతో వున్న స్త్రీ వలే నా యేరు నిండిపోయేది. కొండలన్నీ, మేఘాల్ని కప్పుకొని తెల్లనయ్యేవి[కొండలు మబ్బుల్ని కప్పుకొని తెల్లగా అయ్యాయట]”ఇవన్నీ కూడా చలంగారు రాసిన ప్రకృతి వర్ణనలు. అలాగే రాజేశ్వరి ఒకసారి ఏటి వైపు నడచుకుంటూ వెళ్ళినపుడు ఉన్నటువంటి వాతావరణం..”యేరు...ఒంటరిగా దాటి ఇసకలో నడచుకుంటూ అవతలి గట్టుకు చేరుకున్నది. సూర్యుడు మైదానం చివర భూమిని తాకుతున్నాడు. చిన్న గాలికి గడ్డి, నా పాదాలకేసి వంగింది. ఇసక గుట్టల్లోని పిచ్చికలు యెగిరి కూర్చొని, నన్ను చూసి విసుక్కుంటున్నాయి. చేపల మీద ఆశను వదలి పిట్టలు గూటికి ప్రయాణం కట్టాయి. కొంగల బారు, కొండలమీద నుండి వెళుతూ లోకంలో ఒంటరి తనాన్ని గాడంగా స్ఫురింప జేశాయి.” ఇది చలంగారి శైలి.

అమీర్ ఎప్పుడైతే ఆ తోళ్ళ సాయిబు కూతుర్ని ప్రేమించానన్నాడో, అది తెలిసిన క్షణంలో రాజేశ్వరికి అనిపించిన భావాలు “మామయ్యా అన్న మాటలు నిజమేనేమో?ఇలా శరీర ఆకర్షణకు లోబడి, జీవితాన్ని ఒప్పగించుకొన్న దౌర్భాగ్యుల గతి ఇంతే గామోసు. ఉధృతమూ, నిరాకంటమూ అయిన పనికి అంతం ఇంతేనేమో. ఏ నిగ్రహమూ, నియమమూ లేకుండా ఇంకొకరి భార్య అని యోచించ కుండా నన్ను కోరిన అమీర్, నన్ను వదలి, ఇంకొకర్ని మోహించడంలో ఆశ్చర్యమేముంది?యెంత అసహ్యంగా వున్నా, సంఘ నిర్మితమైన సంసారంలో కొంత శాశ్వతత్వమూ, కాలం వల్ల ఏర్పడి ఛేదించడానికి సాధ్యం కాని బంధనాలున్నాయి. ఇక్కడ వెర్రి దాన్నయానా? మామయ్యే చివరికి వివేకవంతుడా?” అని ఒక్క క్షణం ఆలోచించింది రాజేశ్వరి. కానీ, వెంటనే ఆ అమీర్ మీద ఉన్న పిచ్చి ప్రేమతోటి , తర్వాత దశలన్నీ జరిగాయి.

తోళ్ళ సాయిబు కూతురుతో మాట్లాడి, అమీర్ ని అక్కడకు తీసుకువెళ్ళాక, ఆమె అనుకునేటటువంటి మాట ”మన బాధతో ఇంకొకరికి ఆనందాన్ని కల్పించామనే జ్ఞ్యానం కన్నా గొప్ప ఆనందం లోకంలో లేదు అనిపించింది”....ఊరికే గుడ్డిగా ప్రేమించబడడం ఒక విషయం. ప్రేమిస్తున్నారు ’అని సంతోషంగా ఉంటుంది. కానీ, అటువంటి రసజ్ఞ్యుడూ,సౌందర్యారధికుడూ, ప్రేమిస్తూ, ఎందుకు ప్రేమిస్తున్నాడో, దేన్ని ప్రేమిస్తున్నాడో తెలుసుకొని, ప్రేమించి, ప్రేమను పొంది, అతను ప్రేమించగల సౌందర్యాన్ని కలిగి వున్నాను’అనే టటువంటి జ్ఞానం గొప్ప గర్వాన్ని ఇస్తుంది” అంటుంది.అమీర్ తనను ప్రేమించాదు అనే,

గర్వం రాజేశ్వరికి కూడా వచ్చింది. తను గర్భవతి నని తెలిసినపుడు తనలో వున్న భావాలను ఇలా చెబుతుంది రాజేశ్వరి ''మెల్లిగా, గుండ్రంగా , పక్క ఎముకల్నీ, నా గుండెల్నీ, నా ఆత్మనీ తాకుతూ చిన్ని కాళ్ళతోనూ పెదిమలతోనూ కదిలింది.....నా మొఖం తిరిగింది.యెట్లా తన ప్రాణం కోసం పాపం తన నోరులేని, దిక్కుమాలిన చిన్న కూన తన ప్రాణం కోసం వేడుకుంటోంది''అంత జాలి అనిపించింది. అంత సున్నితమైన భావాలు వచ్చాయి.

కానీ, ఒక్కసారి అమీర్ వెళ్ళిపోగానే, మళ్ళీ అతని ప్రేమలో పడి, అదే స్వచ్ఛమైన ప్రేమ అనుకుని, దాని కోసమని తాను త్యాగానికి కూడా సిద్ధపడింది. అలా గుండెల్ని పిండేసే భావాలూ, హృదయాన్ని ఎక్కడికో తీసుకెళ్ళే ప్రక్రుతి వర్ణనలూ, ఆలోచనల సుడిగుండాలనుఎగరేసే మధ్యలో వాక్యాలు ఇవి చాలు "చలం మరో శతాబ్దం పాటు నిలిచి వుంటాడు" అని చెప్పడానికి.

చలంగారి మైదానం గురించిన మరికొన్ని విశేషాలు ఏమిటంటే...ఆయన 1931 ప్రాంతంలో ఈ మైదానం నవలని ఏదో పత్రికలో సీరియల్ గా వెయ్యడానికని ఇచ్చారు. పత్రికలో ప్రారంభించారు గానీ, ఆ తరువాత పాఠకుల్లో వ్యతిరేకత వల్ల ఆపేశారు.1934 ఆంధ్రా యునివర్సిటీ వాళ్ళు నిర్వహించిన నవలల పోటీకి దీన్ని పంపించారు. అయితే, ఆ పోటీలో విశ్వనాధ సత్యన్నారాయణ గారి "వేయి పడగలు"అడవి బాపిరాజు గారి''నారాయణరావు''ఎంపిక అయ్యాయి. సహజంగానే మైదానం నవల ఎంపిక కాలేదు.

ఆ తరువాత 'మైదానం' నవలను పోలిన కథాంశంతో, విశ్వనాధ వారు "చెలియలికట్ట"అనే నవలను రాశారు. గోపీచంద్ గారు కొంచెం ఇలానే ఉండేలా''మెరుపుల మరకలు''అనే నవల రాశారు. రచయత్రి లత గారు''కాలం కరచిన కడపట''అని రాశారు. ఇంతగా మైదానం వచ్చిన కొత్తలో సంచలనం సృష్టించింది. ఇంకా సృష్టిస్తూనే ఉంది. ఇవండీ మైదానం గురించిన విశేషాలు.

ఇప్పుడు చలం గారు రాసిన ఒక కథను పరిచయం చేస్తాను. ఆ కథ పేరు''సుశీల''. ఈ కథను చలం గారు 1924లో అంటే, 30 ఏళ్ళ వయసులో రాశారు. కథల విషయానికి వస్తే, చలంగారు వంద కథలు రాశారు. ఆయన రాసిన మొట్ట మొదటి కథ "భార్య". అది 19 24 జూన్ లో వచ్చింది.అది రాసిన ఒకటి, రెండు నెలలకి ఈ "సుశీల"అనే కథ రాసారు. ఇది ఆయన రాసిన రెండో కథ. ''సాహితీ''అనే పత్రిక లో వచ్చింది. ఈ కథ రాసేటప్పటికి రెండు నవలలూ, నాటికలూ, వ్యాసాలూ రాసి ఉన్నారు. అంటే, మైదానం నవల రాయడానికి మూడు సంవత్సరాల ముందు ఈ కథ రాశారు.

వ్యక్తి గత జీవితంలోకి వస్తే, చలం గారు ఈ కథ రాసేటప్పుడు బందర్లో వుద్యోగం చేస్తున్నారు. ఒక పక్క భారతదేశంలో స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కథ రాశారు. 'సుశీల' కథ లో ఏముందో చూద్దాం...

ఈ కథలో ప్రధాన పాత్ర పేరు 'సుశీల'. చాలా అద్భుతమైన సౌందర్య రాశి. ఆమె భర్త నారాయణప్ప. ఆ వూర్లో బాగా ధనవంతుడు. పెళ్ళయి పదేళ్లయింది. సంతానం లేదు. భర్త చాలా అనురాగంగా చూసుకుంటుంటాడు. వాళ్ళిద్దరి మధ్యా ప్రేమనురాగాలకి ఏమాత్రం లోటు లేదు. నారాయణప్ప బాగా ధనవంతుడు అవ్వడంతో వుద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు.

సాయంకాలం అయ్యేసరికి అందరూ ఆయన ఇంటికే వస్తుంటారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులూ, ప్లీడర్లూ, పోలీసులూ ఇలా అన్ని రకాల వాళ్ళు వస్తుంటారు. వాళ్ళ ఇంట్లో ప్రతిరోజూ పార్టీలు జరుగుతుంటాయి. టెన్నిస్ ఆడడం, పేకాటా, కబుర్లు చెప్పుకోవడం ఇలా. సుశీల కూడా వాళ్ళ దగ్గరకు వస్తువుండడమే కాదు, షేక్ హాండ్ కూడా ఇస్తుంది. ఆ రోజుల్లో అది చాలా గొప్ప విషయం. ఇంట్లో ఆడవాళ్ళూ బయటకు రావడం, షేక్ హాండ్ ఇవ్వడం.

ఇలాంటి సమయంలో 'సులేమాన్' అనే పోలీసు అధికారి ఆ వూరికి కొత్తగా వచ్చాడు. మరి సహజంగానే ఊర్లోకి వచ్చిన అధికారులు, నారాయణప్పగారి ఇంటికి వస్తూవున్నట్టే, అతను కూడా వస్తున్నాడు. సుశీల అందరితోనూ కలివిడిగా వుండడం, షేక్ హాండ్ ఇవ్వడం చూసి అతను చాలా ఆశ్చర్యపోతాడు. ఏమిటి?ఇండియా లో కూడా ఇంత ముందు భావాలు వున్న వాళ్ళు వున్నారా? అనుకున్నాడు 'సులేమాన్'. అలా కొన్ని సార్లు వచ్చే క్రమంలో సుశీలా, సులేమాన్ లు దగ్గరయ్యారు. వాళ్ళిద్దరి మధ్యా శారీరక సంబంధంగా కూడా మారింది. ఆ విషయం నారాయణప్ప గారికి తెలీదు. ఎందుకంటే, అతనికి భార్యంటే ఏమాత్రమూ అనుమానం ఉండేది కాదు. ఆయన స్వచ్ఛంగా ప్రేమిస్తున్నారు భార్యని. ఆమె కూడా అలాగే వుండేది. ఆ పరిస్థితిని చెబుతూ చలం గారు అంటారు.."కొందరు స్త్రీలు వాళ్ళను ఎవరికిచ్చి పెళ్ళి చేస్తే, వాళ్ళను వెంటనే ప్రేమిస్తారు. ప్రేమించినట్టే ఉంటారు.ప్రేమించామనే వాళ్ళు అనుకుంటారు. దాంట్లో ఏమీ మోసం లేదు. కానీ, ఎప్పుడో ఒకప్పుడు ఒక కొత్త వారిమీద నిలవరాని ప్రేమ కలుగుతుంది వారికి. వారి హృదయాలు ఎవరికోసం చెయ్య బడ్డాయో, అటువంటి వారిని కలుసుకుంటారు. అప్పుడు ఆ మహా అగ్నిలో పూర్వపు ప్రేమా, నీతీ, విశ్వాసం అన్నీ దగ్ధమవుతాయి. ఎవరూ ఆపలేరు. కొన్ని బయటకు వస్తాయి. కొన్ని ఒకరిద్దరికి తెలిసి ఆగిపోతాయి.కొన్ని బయటకు రానేరావు."

ఇలాంటి నేపథ్యంలో ఈ సులేమాన్, సుశీలలు ఇద్దరూ కూడా దగ్గరై వాళ్ళ సంబంధం కొనసాగుతున్నప్పుడు, ఒక రోజు నారాయణప్ప గారికి ఏదో అనుమానం వస్తుంది. వచ్చి అడుగుతాడు"ఏమిటి సుశీలా?నీ ప్రవర్తన ఏదో తేడాగా వుంది"అని. ఆమె చెప్పదు."ఏమీలేదు...ఏమీలేదు..."అంటుంది కానీ, బయట పెట్టదు.

"లేదు. నీ దగ్గర ఏమైనా ఉంటే చెప్పు,నేనేమీ అనుకోను,క్షమిస్తాను. నీ మీద ప్రేమ ఎప్పటికీ ఇలాగే ఉంటుంది." అంటాడు. అయినా చెప్పదు సరికదా..పోలీసు క్వార్టర్స్ లో ఏదో పేరేడ్ జరుగుతుంటే, "వెళతాను"అంటుంది.

"వద్దు, నువ్వెళ్ళ వద్దు.బాగుండదు. అక్కడ పోలీసుల దగ్గరకు నువ్వెళ్ళడం ఏమిటి?"అంటే, "వెళ్ళకుండా వుండి పోవడానికి కారణం ఏముంది? ఏమైనా నేను వెళ్తాను"అని బండి కట్టించుకొని వెళ్తుంది. అక్కడ ఇంకో మాట రాస్తారు చలం గారు" ప్రేమ మారుస్తుంది.సామాన్య మానవుల్ని, దేవతల్ని చేస్తుంది"అని. ఇదిగో ఇలాంటి వాక్యాలు రాసి, చలంగారు ఆ రోజుల్లో వున్న యువతరాన్నీ, అలాగే మహిళా లోకాన్ని అందర్నీ కూడా ప్రభావితం చేశారు.

ఆ రోజు అక్కడకు వెళ్ళి వచ్చేసరికి, మధ్యాహ్నం అవుతుంది. నారాయణప్ప గారికి అనుమానం మరింత దృఢపడుతుంది. కానీ, భార్యను తిట్టడం గానీ, ఎదిరించడం గానీ ఏమీ చెయ్యడు. ఇలా వుండగా దేశంలో సహాయ నిరాకరణోద్యమం

మొదలవుతుంది.[నాన్ కోపరేషన్ మూమెంట్] నారాయణప్ప గారు ఆ ఉద్యమం లోకి దూకుతారు. గాంధీ గారి ఫోటోలు పెట్టడం, ఖద్దరు ధరించడం ఇలాంటివి. సహజంగానే అవి ప్రభుత్వానికి వ్యతిరేకం. మరి సులేమాన్ ఏమో పోలీసు అధికారి. రోజూ వీళ్ళ ఇంటికి వస్తుంటాడు.ఒక రోజు రాత్రి వీళ్ళిద్దరూ తోటలో వుండగా నారాయణప్ప చూస్తాడు. చూసి చెబుతాడు ”నాకర్థమయ్యింది. ఏం జరుగుతున్నదో.ఒక పని చెయ్యి. అతన్నిఎప్పుడూ ఇంటికి రావద్దని చెప్పు”అంటాడు.

అయితే, సుశీలకు భర్తంటే కోపం వుండదు. ద్వేషం వుండదు.కానీ, ఆ సులేమాన్ మీద కూడా ప్రేమ ఉంది. “సరే!అతన్ని రావద్దని చెబుతాను”అని, ఆ మర్నాడు తానే బండి కట్టించుకొని ఆ సులేమాన్ వుండే బంగ్లాకు వెళుతుంది. నారాయణప్పగారు ఈ ఉద్యమం హడావుడిలో ఉంటారు. అలా వెళ్లి వస్తున్న క్రమం లో ఒక రోజు సుశీల ఇంటికి వచ్చేసరికి ఇల్లు హడావుడిగా వుంటుంది.”ఏం జరిగింది?”అని అడుగుతుంది.”నారాయణప్పగారి మీద కేసు వేశారు. ఎప్పుడైనా గానీ, అరెస్ట్ చేయవచ్చు “అని.

ఆ రాత్రి కూర్చొని సుశీల ఆలోచిస్తుంది.”నేనేం చేస్తున్నాను.నా భర్త ఏం చేస్తున్నాడు?నా భర్త ఈ పవిత్రమైన ఉద్యమం లో తిరుగుతుంటే, నేను ఆ సులేమాన్ దగ్గరకు వెళుతున్నాను”అనుకొని, నారాయణప్ప గారికి తోడుగా ఆ ఉద్యమం లోకి దూకుతుంది. తానూ ఖద్దరు చీరలు కడుతుంది. ఊరూరా తిరిగి ఆ ఖద్దరు చీరెలు అమ్ముతూ వుంటుంది.ఇదంతా సులేమాన్ చూస్తాడు.”ఇదేమిటీ? నువ్విలా అయిపోయావు? నా దగ్గరకు వస్తుండేదానివి కదా!” అయినా నెమ్మది నెమ్మది గా అతనికి దూరం అవ్వడానికి ప్రయత్నిస్తుంది. అతన్ని అసహ్యించు కోకుండా  చెబుతుంది.

” నువ్వంటే నాకు ప్రేమే ఉంది. కానీ, నా భర్త ఈ ఉద్యమంలో వుండగా..నీ దగ్గరకు ఎలా వస్తాను?”అంటుంది. ఒక రోజు అతను బలవంతం చేస్తాడు”నాతో వచ్చేసెయ్! ఎక్కడికైనా వెళ్లిపోదాం”అంటాడు. దానికి కూడా ఒప్పుకోకుండా ఏం చెబుతుందంటే,”నా భర్త ఉద్యమం చేస్తున్నప్పుడు, దీనిని అంతా వదిలేసి,నేను నా సుఖం చూసుకోవడం నా కిష్టంలేదు” అంటుంది. ఇదిలా వుండగా నారాయణప్ప గారిని జైల్లో పెడతారు. జైల్లో పెట్టినపుడు ఆయన ఆరోగ్యం దెబ్బతింటుంది. అసలే అంతకుముందు ‘ఉబ్బసం’వ్యాధి వుండేది. దానికి తోడు జైలు నుండి బయటకు వచ్చేసరికి ‘క్షయ’ వ్యాధి వచ్చింది. సులేమాన్ మాత్రం సుశీల కోసం తిరుగుతూనే వుంటాడు.ఆమెను బతిమాలుతూనే వుంటాడు”నాతో వచ్చేయ్”అంటూనే వుంటాడు.

జైలు నుండి రాగానే నారాయణప్ప గారిని తీసుకొని మదనపల్లె లోని ‘టి.బి. శానిటోరియం’కు తీసుకువెళుతుంది. సులేమాన్ 2,3 నెలలు చూస్తాడు. వీళ్ళు కనపడరు.మదనపల్లె లో వున్నారని తెలుసుకొని అక్కడకు వెళతాడు.అక్కడకు వెళ్లేసరికి అక్కడ దృశ్యం ఎలా వుందంటే...ఒక చెట్టు కింద నారాయణప్ప గారు నిద్రపోతున్నారు. మంచం పక్కన గుడ్డ కుర్చీలో సుశీల పుస్తకం చదువుకుంటూ కూర్చొని వుంది. వెనుక బల్ల మీద మందు సీసాలు వున్నాయి.అవి చూసేసరికి సులేమాన్ కాళ్ళు వణికాయి. కళ్ళ వెంబడి నీళ్ళు వచ్చాయి. ప్రేమంతా ఒక్కసారి తిరగబెట్టింది. అక్కడే నిలుచుండి పోయాడు సులేమాన్.

సరే! సుశీలను దూరంగా పిలిచి మాట్లాడాడు. సుశీల అంది " ఎందుకు ఇక్కడకు వచ్చేశావు. నా భర్త...నా భర్తను ఎలా వదిలి పెడతాను."

"నీ భర్త పోయాక ఏమవుతుంది?"

"ఆ ఊహ కూడా రానివ్వవద్దు. నేను అలా ఆలోచించలేను. నువ్వెళ్ళి ఫో! వెళ్లి పెళ్లి చేసుకో... నా మీద ప్రేమను మరచిపో...అప్పుడు నిన్ను గాఢంగా ప్రేమించాను.ఇప్పటికీ ప్రేమిస్తూనే ఉన్నాను. కానీ, నా భర్తను వదలి మాత్రం రాలేను."అని చెప్పడంతో, వెళ్ళిపోతాడు. అప్పుడే లేచిన నారాయణప్పగారు చూస్తారు. సుశీల చప్పుడు కాకుండా ఏడుస్తూ వుంది. కుర్చీ వెనకనుండి ఆమె మీద చెయ్యి వేస్తారు. "సుశీలా!చూస్తూనే వున్నా, యెట్లా ఉంటావు.ఆనందం అక్కర్లేదూ..?"

ఆ వాక్యం నారాయణప్ప గారిని తీసుకెళ్ళి ఎక్కడో శిఖరం మీద కూర్చో బెడుతుంది.అంత ఉన్నతమైన వ్యక్తిత్వం. భార్య, సులేమాన్ తో వుందని తెలిసినా గానీ, ఏమీ అనలేదు. ఆయన ప్రాణాపాయ స్థితిలో వున్న ఇప్పుడు కూడా"నీకు ఆనందం కావాలి కదా!"అన్నారు.

"ఆ సంగతి మాట్లాడకండి. అదంతా అయిపోయింది."అంది సుశీల.

"నిజంగానే నీకు దిగులు లేదా?"

"అతను నా కోసం పడే బాధ కోసం దిగులు వేస్తుంది"

"నీకోసం నీకు దిగులు లేదా?"

" నాకోసం నాకే దిగులూ లేదు.నేను పవిత్రురాలినై, మీ సేవ చేయడానికే ఉంటే, యెంత బాగుండేది. మీ దగ్గర వుండడం, మీకు సేవ చెయ్యడం, నాకు స్వర్గ తుల్యంగా ఉంది. ఎవరికి లభిస్తుంది ఇలాంటి అదృష్టం. నావంటి దాన్ని మీ సేవకు అంగీకరించినందుకు నాకు ఎంతో...." అని అంటూ వుండగా "నిజంగానేనా?"అంటాడు.

"నిజంగానే జరిగినదానికి ఏడ్చానంతే..." ఇదీ కథ.

ఈ కథ రాసిన మూడు సంవత్సరాల తర్వాత "మైదానం"రాశారు. ఈ కథలోని పాత్రలలోని లేయర్స్ ఏమిటో చూద్దాం.కథలో ప్రధాన పాత్రలు మూడే.

సుశీల, మైదానంలో రాజేశ్వరి లాంటిది కాదు. భర్త మీద ప్రేమను ఎప్పుడూ వదులుకోలేదు. తాను చేస్తున్నది సబబు కాదేమోనని అనుకుంటూనే, సులేమాన్ ప్రేమలో పడింది. భర్తకు తెలిసిపోతుందని, తెలిసి కూడా ఆ సంబంధాన్ని మానుకోలేక పోయింది. అతన్ని ఇంటికి రావద్దని చెప్పి, తనే అతని బంగ్లా కు వెళ్ళింది. భర్త దేశం కోసం చేస్తున్న త్యాగాలు ఆమెను ఆలోచింప జేసాయి. భర్త అనారోగ్యం ఆమెను పూర్తిగా మార్చేసింది. అంతే కాకుండా, తల్లి, బిడ్డకు చేసిన దానికంటే, ఎక్కువగా సేవ చేసింది. ఇది కూడా చలం గారు రాసినటువంటి వాక్యమే. సుశీలలో రెండు ప్రేమలున్నాయి. ఒకటి సులేమాన్ తో కోరికతో కలిసిన ప్రేమ. రెండు బాధ్యతా, బంధం, గౌరవం అన్నిటితో కూడిన భర్త మీద ప్రేమ. వీటిలో భర్త మీద ప్రేమే గెలిచింది.

రెండో పాత్ర సులేమాన్. అతనికి చిన్నప్పటినుండీ అనుకున్నది ఎలాగైనా సాధించాలనే గుణం. అలాగే, కష్టపడి పోలీసు ఆఫీసరయ్యాడు. సుశీలను చూడగానే కావాలని అనుకున్నాడు. సాధించాడు. అయితే, సుశీల "రాను" అన్నప్పుడు, బలవంతం చెయ్యలేదు. మైదానంలో అమీర్ లాగా కొట్టడం, దౌర్జన్యం చెయ్యడం చేయలేదు.

ఇక నారాయణప్ప, ఇతనిది మొదటినుండీ చివర వరకూ కూడా చాలా సున్నితమైన వ్యక్తిత్వం. భార్యకు స్వేచ్చని ఇచ్చాడు. ఆ స్వేచ్చను ఆమె దుర్వినియోగం చేస్తుంది. అని తెలుసుకున్నప్పుడు కూడా అతనేమీ దౌర్జన్యం చెయ్యడం గానీ, భార్యను తిట్టడం గానీ ఏమీ చెయ్యలేదు. చిట్టచివరి వాక్యంలో కూడా "నీకు ఆనందం కావాలి కదా! నువ్వెళ్ళ వచ్చు."అనే అన్నాడు. ఇది నారాయణప్ప పాత్రలో ఉన్న ప్రవర్తన. ఈ కథలో చలం గారు చెప్పదలచుకొన్న దేమిటి? చెప్పేదేమిటి?అన్నవి పాఠకులకు వదిలేస్తూ ఈ కథ విశేషాలు ఇక్కడ ఆపేస్తాను.

గమనించాల్సిన విషయం ఏమిటంటే...చలంగారు సుశీల, 'అటు నారాయణప్ప గారినీ, ఇటు సులేమాన్ నీ ప్రేమిస్తున్నది' అని, ప్రేమ..ప్రేమ..అనే మాట వాడారు తప్పా ఎక్కడా కూడా అక్రమ సంబంధం, వివాహేతర సంబంధం, అనైతికం, పరాయి పురుషుడు ఇలాంటి మాటలు ఎక్కడా వాడలేదు. అందుకే, ఆయన తన రచనల గురించి..."నేను, నా హృదయం అంతటి లోనూ తపించే ఈ స్త్రీ, పురుష విషయమై కూడా ఇతరులలో అగ్ని ప్రవేశ పెట్టలేను. పెట్టాలని ఇష్ట పడను. అందువల్ల, నేను యెంత తీవ్రంగా, గొప్పగా రాసినా కూడా నాకు అనుచరులు లేరు.[ఆ టైం లో] నా రచనల వల్ల సంఘమే కాదు, ప్రత్యేక జీవనాలు అభివృద్ధి పొందాలని నా ఆశ. అంతే గానీ, నాకు గానీ, నా అభిప్రాయాలకు గానీ,అనుచరులు కావాలని కాదు. నా మిత్రులు గానీ, నా పిల్లలు గానీ నాతో ఏకీభవించాలని కాదు. ఏకీభవిస్తారేమో ననే భయం" అని ఆయన ఒకప్పుడు తన రచనల గురించీ, స్త్రీ ని కేంద్ర బిందువుగా రాసిన రచనల గురించి రాశారు. ఆయన ఏమంటారంటే...

"అంతర్లీనంగా స్త్రీ గానీ, పురుషుడు గానీ తన వ్యక్తిత్వాన్ని బట్టి, సహజ ప్రేరణను బట్టి ప్రవర్తిస్తారు. వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యమైనటువంటి విలువ" అని ఆయన రచనలన్నిటి లోనూ చెబుతారు.

చలం గారి ఏ ఒక్క రచనను కూడా విడిగా చూసి, "ఇదే చలం గారి సిద్ధాంతం" అని మనం తీర్మానించుకోలేం. ఇప్పుడు నేను చలం గారి ఒక నవలా, ఒక కథా పరిచయం చేశాను. దీన్ని బట్టి చలం గారు అన్నీ ఇలాగే రాశారు అనుకోకూడదు. మరి కొన్ని వీటికి భిన్నంగా కూడా వున్న రచనలు కూడా పరిచయం చేస్తాను. అందుకే, చలంగారు "ఏమిటండీ అప్పుడు అలా రాశారు. ఇప్పుడు ఇలా రాశారు"అంటే..."అప్పుడు అలా అనిపించింది అలా రాశాను. ఇప్పుడు ఇలా అనిపించింది ఇలా రాశాను." అని ధైర్యంగా చెప్పగలిగారు. ఎక్కడా కూడా హిపోక్రసీ కి పోలేదు. రాసిన దానిని సమర్ధించుకోవడానికి వెళ్ళలేదు. అందుకనే, చలం గారి రచనలు చదివేటప్పుడు, వాటి గురించి ఒక నిర్ణయానికి వచ్చేముందు అది రాసిన కాలం ఏమిటి? ఆ సమయంలో చలంగారి పరిస్థితి ఏమిటి?ఇలాంటివన్నీ చూసి మనం ఒక నిర్ణయానికి రావాలి.ఆయన రచనల్లో 'స్త్రీ' యే కేంద్ర బిందువు అయినప్పటికీ, వివిధ రచనల్లో స్త్రీ పాత్రల యొక్క రూపాలు వివిధ కోణాల్లో, వివిధ రూపాల్లో వున్నాయి. వాటిల్లోని

పొరల్ని అర్థం చేసుకోకుండా ఆ పాత్రల్ని అర్థం చేసుకోలేం. అందుకే చదివిన ప్రతిసారి కొత్త అర్థాన్ని కలిగిస్తుంటాయి. అందుకే శతాబ్దం తరవాత కూడా ఆయన రచనలు సజీవంగా నిలబడి వున్నాయి.

★★★★★★★★★★★

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 జనవరి 26 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS